సాక్షి ప్రకాశం
బుధవారం ¦ 29 ¦ నవంబర్ ¦ 2023



విధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. మార్కాపురంలో నియోజకవర్గ స్థాయి సమీక్షలో ఆయన మాట్లాడారు. - 8లో..



రుణాల రెన్యువల్‌పై రైతుల ఆందోళన

మార్కాపురం కెనరా బ్యాంకులో రుణాల రెన్యువల్ విషయంలో పదుల సంఖ్యలో రైతులు ఆందోళనకు దిగారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
32/24.3

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

బీసీలు బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు బ్యాక్‌బోన్

● రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: బీసీలు బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదని, బ్యాక్‌బోన్‌లని చాటిన గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెద్దపీట వేస్తూ ఉపకులాలవారీగా కార్పొరేషన్‌లు ఏర్పాటుచేసి వారికి రావాల్సిన వాటాను కేటాయించారని చెప్పారు. మహాత్మ జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాలవేసి మంత్రి నివాళులర్పించారు. గతంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకొని అధికారంలోకి వచ్చిన తరువాత కనీస గౌరవం కూడా ఇవ్వకుండా వదిలేశారని విమర్శించారు. జ్యోతి రావుపూలే, బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రాంలను ఆదర్శంగా తీసుకొని ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని, అటువంటి వ్యక్తికి తామందరం అండగా నిలవాలని, తిరిగి జగనన్నను సీఎంగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు సయ్యద్ షాబీర్‌బాష, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎం.ఆదిశేషు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములునాయక్, శ్రీశైలం దేవస్థానం కమిటీ మాజీ డైరెక్టర్ ఐ.వి.సుబ్బారావు, సర్పంచ్ ఆర్.అరుణాబాయి పాల్గొన్నారు.

ప్రతి రోజు స్వామిత్వ గ్రామాలు సందర్శించాలి

● డీపీవో నారాయణరెడ్డి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీపీవో నారాయణరెడ్డి

ఒంగోలు సిటీ: జిల్లాలో జరుగుతున్న స్వామిత్వ సర్వేలో భాగంగా విస్తరణాధికారులు ప్రతి రోజు ఒక స్వామిత్వ గ్రామాన్ని సందర్శించాలని డీపీవో జి.వి.నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ దినేష్‌కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జగనన్న స్వచ్ఛ సంకల్పం, స్వామిత్వ నిర్వహణపై డీపీవో నారాయణరెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ అన్నీ గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు విధిగా నిర్వహించాలన్నారు. వీధుల్లో రోడ్ల వెంట ఉన్న చెత్త దిబ్బలు గుర్తించి వాటిని వెంటనే తొలగించాలన్నారు. మురుగు కాలువలు ఎప్పటికప్పుడు పూడిక తీయాలన్నారు. మురుగు కాలువల్లో, నిల్వల దగ్గర ఎబేట్ పిచికారి చేయాలన్నారు. డిసెంబరు నెల చివరలోగా నిర్మాణ దశలో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఎంపీడీఓలు తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతిదీ జేఎస్ఎస్ యాప్‌లో పొందుపరచాలని ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలి



మహిళా కబడ్డీ జట్టుతో ఉపాధ్యాయులు

సింగరాయకొండ (జరుగుమల్లి): క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్.శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. ప్రకాశం మహిళా కబడ్డీ జట్టుకు ఈ నెల 24 నుంచి మంగళవారం వరకు శిక్షణ కార్యక్రమం పాకల జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్వహించినట్లు కబడ్డీ కోచ్, వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్య తెలిపారు. క్రీడాకారుణులకు గొల్లపోతు గోవర్ధన్ బ్రదర్స్ క్రీడా దుస్తులు, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరిబాబు, కె.కృష్ణారెడ్డి రవాణా ఖర్చుల నిమిత్తం రూ.5 వేల నగదు, బి.ప్రభాకరరెడ్డి, బి.అశోక్‌కుమార్ రెడ్డి భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు. కబడ్డీ శిక్షణ ముగింపు కార్యక్రమంలో దాతలందరినీ సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు శ్రీను, అంకయ్య, ఎస్ఎంసీ చైర్మన్ ఈతముక్కల మాధవరావు పాల్గొన్నారు.

ఆరోగ్య భాగ్యం



ఒంగోలు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో నవజాతశిశువు ఎస్ఎన్‌సియు వార్డు

● ఖరీదైన వైద్యం ఉచితంగా..
● కేవలం రూ.200కే స్కానింగ్, ఎంఆర్ఐ పరీక్షలు
● చిన్నారులకు వెంటిలేటర్ చికిత్సలు సైతం ఉచితం
● ఎలాంటి కార్డులేకున్నా అత్యవసర చికిత్సలు
● శారీరక, మానసిక ఎదుగుదల లేని పిల్లలకు పౌష్టికాహారం అందజేత

ఒంగోలు టౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేస్తోంది. నిరుపేద, సామన్య మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యత ఇస్తోంది. గత తెలుగు దేశం ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వ వైద్యశాలలకు అవసరమై నిధులు మంజూరు చేయడమే కాకుండా అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులో తెచ్చింది. ఖరీదైన వైద్యాన్ని పేదలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉచితంగా కార్పొరేట్ తరహా వైద్యసేవలు అందిస్తోంది. వైద్యుల కొరత లేకుండా చేసింది. నాణ్యమైన మందులను అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రానికి చెందిన వారు పొరుగు రాష్ట్రాల్లో ఉండి ఆరోగ్యశ్రీ.., తెల్లరేషన్ కార్డు ఇలా ఎలాంటి గుర్తింపు కార్డులు లేకపోయినా వైద్యసేవలను అందిస్తోంది. అవసరమైన శస్త్రచికిత్సలను సైతం ఉచితంగా చేస్తోంది.



నాగులూరి కోటయ్య

ఈ ఫొటోలో ఉన్న అతని పేరు నాగులూరి కోటయ్య (55). కనిగిరి మండల రామాపురం గ్రామానికి చెందిన అతనికి నలుగురు సంతానం. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే భార్య చనిపోయింది. దాంతో పిల్లలు చెరోదారి పట్టారు. కోటయ్య ఇక్కడ చేసేదేమీలేక హైదరాబాద్‌కు వెళ్లి భవన నిర్మాణ కార్మికుడిగా పనులు చేసుంటూ ఒంటరిగా జీవిస్తున్నాడు. అప్పుడప్పుడూ కనిగిరికి వచ్చి పిల్లలను చూసుకొని పోతుంటాడు. ఎప్పటిలాగే కనిగిరి వచ్చిన ఆయన ఆదివారం రాత్రి రామాపురం వెళుతుండగా కారు ఢీ కొట్టింది. దీంతో ఆయనకు కాలు విరిగింది. 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అతడిని ఆస్పత్రిలో చేర్చుకొని ఎక్స్‌రే తీసి చూడగా ఎడమకాలిలో రెండు ఎముకలు విరిగాయి. వెంటనే శస్త్ర చికిత్స చేసి ప్లేట్, నైల్ అనే పరికరాలను అమర్చాల్సి ఉంటుందని వైద్యులు నిర్ధారించారు. హైదరాబాద్‌లో జీవిస్తున్న కోటయ్య వద్ద ఆధార్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు, రేషన్ కార్డులాంటి ఎలాంటి గుర్తింపు కార్డులు లేవు. దాంతో ఆపరేషన్ చేయడానికి సాంకేతికంగా ఇబ్బంది ఏర్పడింది. అతడికి ఆరోగ్యశ్రీ వర్తించదు. శస్త్ర చికిత్స చేసి ప్లేట్ అమర్చాలంటే రోగులే బయట నుంచి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. వాటి విలువ కనీసం రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు ఉంటుంది. కోటయ్య దగ్గర అంత స్థోమత లేదు. ప్రస్తుతం కూతురు మౌనిక తండ్రి బాగోగులు చూసుకుంటోంది. ఆమె ఒంటరి మహిళ. కూలి పనులు చేసుకుంటూ జీవించే ఆమెకు ఈ ఆపరేషన్ చేయించే ఆర్థిక వెసులుబాటు లేదు. దాంతో రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ తిరుమలరావు మానవతా దృక్పథంతో స్పందించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్‌తో చర్చించారు. ఉన్నతాధికారులతో మాట్లాడారు. బాధితుల వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేకపోయినా జనరల్ ఆస్పత్రుల్లో ఉండే రాష్ట్ర ప్రభుత్వ నిధుల ద్వారా ఆపరేషన్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకు అవసరమైన పరికరాలను సైతం కొనుగోలు చేశారు. ప్రైవేటు వైద్యశాలల్లో రూ.30 నుంచి రూ.40 వేల వరకు ఖర్చయ్యే ఆపరేషన్‌ను కోటయ్యకు మంగళవారం ఉచితంగా చేశారు. ఇది వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ఇస్తున్న ప్రాధాన్యతకు ప్రత్యక్ష నిదర్శనం.

రూ.200కే ఎంఆర్ఐ స్కాన్

క్రిటికల్ కేర్ కేసుల్లో ఎంఆర్ఐ, సిటీ స్కాన్‌లు తప్పనిసరిగా చేయాల్సి వస్తుంది. కేవలం క్రిటికల్ కేర్ కేసుల్లోనే కాకుండా మోకాలు నొప్పులు, నడుము నొప్పి, కొన్నిరకాల గర్భాశయ వ్యాధులు, జీర్ణాశయ వ్యాధుల్లో ఎంఆర్ఐ చేయకుండా చికిత్సలో ముందుకు వెళ్లలేని పరిస్థితి. అయితే ఈ పరీక్షలు ప్రైవేటు క్లినిక్‌లో చేయించాలంటే చాలా ఖరీదుతో కూడుకొని ఉండడంతో రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చు చేయాల్సిన రావడంతో ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితిని గమనించిన మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సమస్యను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి వెంటనే స్పందించి ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్ మిషన్లను మంజూరు చేశారు. ఆఘమేఘాల మీద నిధులను విడుదల జేశారు. రూ.2.75 కోట్ల విలువైన సీటీ స్కానింగ్, రూ.8.81 కోట్లతో ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రాలను కొనుగోలు చేశారు. 2021 మే 19న ముఖ్యమంత్రి జగన్ చేతుల మీదుగా ప్రారంభించారు. దీంతో అత్యంత ఖరీదైన ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్ పరీక్షలు నిరుపేద ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. బయట ప్రైవేటు స్కానింగ్ సెంటర్లలో సీటీ స్కాన్‌కు రూ.2 వేల నుంచి రూ.3,500 వరకు వసూలు చేస్తున్నారు. ఎంఆర్ఐకి అయితే రూ.4 వేల నుంచి రూ.8 వేల వరకు ఫీజు వసూలు చేస్తున్నారు. జీజీహెచ్ (రిమ్స్)లో సీటీ స్కానింగ్, ఎంఆర్ఐకు కేవలం రూ.200 వందలు మాత్రమే వసూలు చేయడం గమనార్హం.



ఒంగోలు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలోని ఎంఆర్ఐ స్కానింగ్ మిషన్

నవజాత శిశువులకు ఉచితంగా వెంటిలేటర్ చికిత్సలు:

రిమ్స్ వైద్యశాలలో నవజాత శిశువులకు నాణ్యమైన అందించేందుకు ప్రభుత్వం చిన్నపిల్లల విభాగాన్ని బలోపేతం చేసింది. పీడీయాట్రిక్ వైద్యులను నియమించడమే కాకుండా ఆధునిక వైద్యపరికరాలను సమకూర్చింది. నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని ఎస్ఎన్‌సీయూను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం 20 పడకలతో వైద్య చికిత్సలు అందిస్తున్నా దాన్ని మరింత విస్తృతం చేసేందుకు మరో 20 పడకలతో కొత్తగా మరో ఎస్ఎన్‌యూను ఏర్పాటు చేశారు. అందులో వెంటిలేటర్ సౌకర్యం కూడా ఉంది. వెంటిలేటర్ చికిత్స చేయాలంటే రోజుకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ఫీజు వసూలు చేస్తున్నారు. అయితే రిమ్స్‌లో ఉచితంగా చికిత్స చేస్తున్నారు. ఒక్క నయాపైసా ఖర్చు చేయకుండానే అత్యంత ఖరీదైన వైద్యం లభిస్తుంది. అంతేకాకుండా శారీరక, మానసిక ఎదుగుదల లేని పిల్లలకు చక్కటి వైద్యం అందించడం విశేషం. న్యూట్రీషనల్ రీ హాబిలేషన్ సెంటర్ (ఎన్ఆర్సీ) ద్వారా ఇలాంటి పిల్లలకు పోషకాహారంతో పాటుగా అవసరమైన వైద్యాన్ని చేస్తున్నారు.



ఒంగోలు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల

సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఒంగోలు రిమ్స్ వైద్యశాలలో అన్నీ రకాల సౌకర్యాలు ఉన్నాయి. నిరుపేద సామాన్య ప్రజలకు మెరుగైన సేవలను ఉచితంగా అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. దీంతో ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్‌లతో పాటుగా కొత్తగా అనేక వైద్య పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. నవజాత శిశువులకు కూడా నాణ్యమైన వైద్యం చేస్తున్నారు. కాన్పులు చేయడానికి సుశిక్షితులైన అనుభవం కలిగిన గైనకాలజిస్టులు ఉన్నారు. మెడికల్, పారామెడికల్ సిబ్బంది ఉన్నారు.

– డాక్టర్ తిరుమలరావు, ఆర్ఎంఓ, జీజీహెచ్ (రిమ్స్) వైద్యశాల

నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్



సభలో మాట్లాడుతున్న పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

● రంగన్నపాలెంలో 220 విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
● విద్యుత్ సబ్ స్టేషన్‌తో నియోజకవర్గంలో అభివృద్ధికి అడుగులు
● రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: రాష్ట్రంలో నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందివ్వడమే తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మంగళవారం పుల్లలచెరువు మండలంలోని రంగన్నపాలెంలో రూ.145 కోట్లతో మంజూరైన 220/132/32 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యుత్ ఇవ్వడంలేదని విమర్శించే వారికి ఈ సబ్‌స్టేషనే సమాధానం అని అన్నారు. విద్యుత్ సబ్ స్టేషన్ వలన పూర్తిగా వెనకబడిన యర్రగొండపాలెం నియోజకవర్గంలోని రైతులు, ప్రజలకు వెలుగులు నింపినట్లవుతుందన్నారు. రంగన్నపాలెంలో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు నేరుగా శ్రీశైలం విద్యుత్ ప్రాజెక్టు నుంచి విద్యుత్ సరఫరా అవుతుందని, దీనివలన బ్రేక్‌డౌన్ కావడం, తరుచుగా విద్యుత్‌లో అంతరాయం కావడం లాంటివి ఉండవన్నారు. నియోజకవర్గంలో దాదాపు లక్ష వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయని, విద్యుత్ అంతరాయంతో రైతుల మోటార్లు కాలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం వలన అనేక ఇబ్బందులకు గురయ్యేవారిని, ఇకపై అటువంటి పరిస్థితి ఉండదని చెప్పారు. పల్నాడు జిల్లా మాచర్లలో వరిగెపూడిసెల ఎత్తిపోతల పథకానికి పుల్లలచెరువు మండల ప్రజలకు సంబంధాలు ఉన్నాయని, వరికెపూడిసెల నుంచి నీరు తీసుకొని వచ్చేందుకు విద్యుత్‌తో పనిఉంటుందని, రంగన్నపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌తో ఆ ఇబ్బంది లేకుండా పోతుందని తెలిపారు. నియోజకవర్గంలో కొరతగా ఉన్న పారిశ్రామికవాడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, పెద్దారవీడు మండలంలోని కుంట–దేవరాజుగట్టు మధ్యలో 100 ఎకరాల భూమిని సేకరించామని అన్నారు. ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయటానికి 70 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేయాల్సి ఉందని చెప్పారు.

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి బాటలు వేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రంగన్నపాలెంలో విద్యుత్ సబ్ స్టేషన్‌కు సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు.

కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే వెలిగొండ ప్రాజెక్టు పనులు చివరి దశకు వచ్చాయని, డిసెంబర్ నెలాఖరు నాటికి పనులు పూర్తవుతాయని అన్నారు. నిర్వాసితుల సమస్యలను కూడా వేగవంతంగా పరిష్కరిస్తామని చెప్పారు. రంగన్నపాలెంలో 220 విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరుకు కృషి చేసిన మంత్రి ఆదిమూలపు సురేష్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. దీనివలన రైతులకు ఎంతగానో మేలు జరుగుతుందని, టూరిజంతోపాటు పారిశ్రామికంగా నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతుమాధవన్, ఏపీ ట్రాన్స్‌కో ప్రాజెక్టు ఎస్ఈ ఎస్.రామచంద్రారెడ్డి, ఆపరేషన్, మెయింటినెన్స్ ఎస్ఈ బి.వి.శేషారెడ్డి, సీపీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ, కన్‌స్ట్రక్షన్ ఈఈ ఎ.కృష్ణారెడ్డి, మార్కాపురం డీఈలు బి.వి.నాగేశ్వరరావు, షేక్ అంజిబాబు, తహసీల్దార్ కె.దాస్, ఎంపీడీవో మరియదాస్, ఎంపీపీలు కె.వెంకటయ్య, డి.కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీలు ఆర్.వాగ్యానాయక్, చేదూరి విజయభాస్కర్, ఏఎంసీ వైస్ చైర్మన్ కె.జయరావు, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు బి.వి.సుబ్బారెడ్డి, కె.ఓబులరెడ్డి, ఎస్.పోలిరెడ్డి, పి.కృష్ణారెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ బాలగురవయ్య, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, బీసీ సంఘం నాయకుడు ఆర్.పిచ్చయ్య, సర్పంచ్‌లు సత్యనారాయణరెడ్డి, కోటిరెడ్డి, వెంకటరెడ్డి, మస్తాన్‌రెడ్డి, ముసలారెడ్డి పాల్గొన్నారు.

4న కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహం ఆవిష్కరణ

● ఒంగోలు బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ఎదురుగా ఏర్పాటు
● వివరాలు వెల్లడించిన జిల్లా ఆర్యవైశ్య సంఘ నాయకులు

ఒంగోలు సబర్బన్: మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహ ఆవిష్కరణ డిసెంబర్ 4న నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా ఆర్య వైశ్య సంఘం నాయకులు వెల్లడించారు. ఈ మేరకు సంఘం నాయకులు బస్టాండ్ సమీపంలోని జిల్లా ఆర్య వైశ్య భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావూరి కాశీరంగ జనార్దన్‌రావు, అద్దంకి వెంకట కృష్ణారావులతో పాటు రాష్ట్ర ఆర్య వైశ్య ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్‌తో కలిసి సంఘం నాయకులు రోశయ్య కాంస్య విగ్రహావిష్కరణకు సంబంధించిన వివరాలను వివరించారు. స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్‌లోని బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న రోడ్డు కూడలిలో 10 అడుగుల కాంస్య విగ్రహం డిసెంబర్ 4వ తేదీ సాయంత్రం 4.45 గంటలకు ఆవిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి సౌజన్యంతో జరుగుతుందన్నారు. ఈ మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి ఆర్యవైశ్యులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సంఘ నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డితో పాటు ఆంధ్రప్రదేశ్ శాసన సభ డిప్యూటీ స్పీకర్ కొలగట్ల వీరభద్ర స్వామి, రోశయ్య పెద్ద కుమారుడు కొణిజేటి శివ సుబ్బారావు, మాజీ మంత్రి, విజయవాడ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస రావు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, టీడీపీ బోర్డు సభ్యులు శిద్దా సుధీర్ కుమార్‌తో పాటు రాష్ట్రంలోని పలువురు ఆర్యవైశ్య నాయకులు, జిల్లాలోని ప్రముఖ ఆర్యవైశ్య నాయకులు కూడా హాజరవుతారన్నారు. విలేకరుల సమావేశంలో సంఘం కోశాధికారి కొత్తూరు శ్రీరంగ నాయకులు, సూపర్ బజార్ చైర్మన్ తాతా బదిరీ నారాయణ, కూరపాటి సత్యనారాయణ, గ్రంధి చెంచురామారావు, పెనుకొండ శ్రీనివాసరావు, గుర్రం బదరీ నారాయణ, సామా సుబ్బారావు, అన్నం శ్రీనివాసరావు, మట్టా రాజారావు, తమ్మన ఆంజనేయులు, చలువాది బ్రహ్మయ్య, కొండా విజయ స్వరూప్, కోడూరి కిషోర్, విట్టా శ్రీనివాస రావు, కజ్జాయం రమేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ఆర్యవైశ్య సంఘ నాయకులు

జగనన్న మా సొంతింటి కలను నిజం చేశారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మా సొంతింటి కలను నెరవేర్చారు. ఇల్లు కట్టుకునేందుకు పెద్దదోర్నాల మండల పరిధిలోని యడవల్లి తిరుమలనాథ స్వామి ఆలయం వద్దనున్న జగనన్న కాలనీ లే అవుట్‌లో ఒక సెంటు స్థలం కేటాయించారు. అందులో ఇల్లు నిర్మించుకునేందుకు రూ.1.80 లక్షలు కూడా మంజూరు చేశారు. దీంతో మేము కూడా కొంత సొంత డబ్బు సమకూర్చుకుని ఇల్లు కట్టుకున్నాం. నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. ఇప్పటి వరకు అద్దె ఇంట్లో ఉండే మేము త్వరలో నూతనంగా నిర్మించుకున్న ఇంట్లోకి వెళ్లనుండటం ఎంతో ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డికి ఎంతో రుణపడి ఉంటాం.

– సింగా రజిత, యడవల్లి గ్రామం, పెద్దదోర్నాల మండలం

విద్యార్థుల్లో నైపుణ్యాల అభివృద్ధి

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీసే చక్కటి విద్యావిధానం అమలవుతోంది. గతంలో కేవలం పుస్తకాల్లోని పాఠ్యాంశాలను మాత్రమే బోధించే అవకాశం ఉండేది. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్, బైజూస్ ట్యాబులు, పాల్‌ల్యాబ్‌ల వంటి సౌకర్యాలతో పిల్లలు ప్రపంచంలో జరుగుతున్న ఆధునిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద వలన విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం లేకుండా ఆరోగ్యాన్ని పెంపొందించుకుంటున్నారు. గతం కన్నా ఇప్పుడు విద్యార్థుల్లో నైపుణ్యాలు అభివృద్ధి చెందుతున్నాయి. ట్యాబులు వారి వద్ద ఉండటం వలన వ్యక్తిగత మూల్యాంకనం చేసుకునేందుకు చక్కటి మార్గం లభించింది.



– జీఎస్ఆర్ సాయి, ప్రధానోపాధ్యాయుడు, వైఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల, కురిచేడు



సురక్షలో ఆరోగ్యశ్రీ కార్డు అందుకున్నాను



గతంలో ఆరోగ్యశ్రీ కార్డు లేక ఆస్పత్రిలో డబ్బులు ఖర్చు పెట్టి వైద్యం చేసుకోవాల్సి వచ్చేది. కార్డు కోసం వలంటీరు ద్వారా జగనన్న సురక్ష కార్యక్రమంలో సచివాలయంలో దరఖాస్తు చేసుకోగా వలంటీరు అవసరమైన పత్రాలు తీసుకొని ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ కార్డు అందించారు. ఈ ఆరోగ్యశ్రీ కార్డుతో ఇక నుంచి ఉచితంగా వైద్య సేవలు వినియోగించుకుంటాను. నాకు సంతోషంగా ఉంది. సీఎం జగనన్నకు ధన్యవాదాలు.

– యనమల అంజమ్మ, మర్లపాడు గ్రామం, టంగుటూరు మండలం

వలంటీరు వలనే నాకు పింఛను అందుతోంది



రెక్కాడితే కానీ డొక్కాడని బతుకు నాది. భర్త చనిపోయిన తర్వాత పొట్టపోసుకోవటం కష్టంగా ఉంది. జగన్ సీఎంగా అయ్యాక సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీరు సునీత అన్ని పత్రాలు తీసుకుపోయి పింఛన్ మంజూరు చేయించింది. ప్రతి నెలా వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు ఇస్తుంది. ఈ సొమ్ముతో రోజూ నాలుగు ముద్దలు తింటున్నాను. ఒకరి మీద ఆధారపడకుండా మందులు కొనుక్కుంటున్నాను. – అన్నప్పరెడ్డి జాలమ్మ, టంగుటూరు

సారవంతమైన భూమి అందించాలి


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

ఒంగోలు సెంట్రల్: జనజీవనిధానంలో నాణ్యమైన ఆహారం ప్రతి ఒక్కరికీ అవసరమని తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడిని సాధించటమే కాకుండా భవిష్యత్ తరాలకు జీవమున్న సారవంతమైన భూమిని అందించాల్సిన ఆవశ్యకతను వక్తలు వివరించారు. ఆత్మ కార్యాలయంలో ఆవరణలో మంగళవారం స్కిల్ ట్రైనింగ్ రూరల్ యూత్ (ఎస్టీఆర్‌వై) ప్రారంభించారు. ఆత్మ పీడీ అన్నపూర్ణ అధ్యక్షతన సభను నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్. శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానవన శాఖాధికారి వై. గోపి చంద్, డీపీఎం వి. సుభాషిణి, దర్శి ఎఆర్ఎస్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ బి. ప్రమీణరాణి, డీడీఏహెచ్ రమేష్‌బాబు, డీఆర్‌సీ ఏఓలు శైలజ రాణి, శేషమ్మ పాల్గొన్నారు.

కన్నకొడుకే కడతేర్చాడు

- అర ఎకరం పొలం కోసం తల్లిని నరికి చంపిన కొడుకు


కొడుకు చేతిలో దారుణ హత్యకుగురైన నక్కల వెంకటరత్నం


సంఘటన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ సోమశేఖర్

చీరాల టౌన్: అర ఎకరం పొలం కోసం నవమాసాలు మోసి కనిపెంచిన తల్లిని కర్కశంగా నరికి దారుణానికి ఒడిగట్టాడు ఓ కొడుకు. బాపట్ల జిల్లా చీరాల మండలం పుల్లాయపాలెం వద్ద మంగళవారం ఈ ఘటన జరిగింది. రూరల్ ఎస్సై పి.జనార్దన్ తెలిపిన వివరాల మేరకు..గవినివారిపాలెం పంచాయతీ పుల్లాయిపాలేనికి చెందిన నక్కల వెంకటరత్నం(59)కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తెను వేటపాలెం మండలం బచ్చులవారిపాలెంలో తన మేనల్లుడికే ఇచ్చి వివాహం చేసింది. తనకు ఉన్న 3.5 ఎకరాల పొలంలో కూతురికి ఒక ఎకరం రాసిచ్చింది. పుల్లాయిపాలెంలో ఇల్లు కట్టుకునే సమయంలో సుమారు రూ.5 లక్షల వరకు అప్పులు అయ్యాయి. అర ఎకరం పొలం అమ్మి బాకీలు తీరుస్తానని తల్లి వెంకటరత్నం చెబుతుండగా ఆ విషయం పెద్ద కుమారుడు శివయ్యకు ఇష్టం లేదు. పొలం తనకే చెందాలంటూ కొద్ది రోజులుగా తల్లీ, కొడుకుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం వేరుశనగపప్పు అమ్ముకునేందుకు వెళ్తున్న తల్లి వెంకటరత్నానికి మాయమాటలు చెప్పి బైక్‌పై చీరాల్లో తాను విడిచిపెడతానని చెప్పి పుల్లాయిపాలెం దాటగానే వెంట తెచ్చుకున్న కత్తితో మెడపై విచక్షణారహితంగా దాడిచేశాడు. సంఘటన స్థలంలోనే తల్లి నిర్జీవంగా పడిపోయింది. వెంటనే శివయ్య పరారయ్యాడు. గ్రామస్తుల సమాచారంతో రూరల్ ఇన్‌చార్జి సీఐ జి.సోమశేఖర్, ఎస్సై పి.జనార్దన్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసును ఇన్‌చార్జి సీఐ సోమశేఖర్ దర్యాప్తు చేస్తున్నాడు. శివయ్యను రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. బుధవారం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నారు.

జగన్‌ను ఎదుర్కొనేందుకు..
గుంటనక్కలన్నీ ఒక్కటవుతున్నాయ్

- పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి


మాట్లాడుతున్న పీడీసీసీ బ్యాంకు చైర్మన్ ప్రసాద్‌రెడ్డి

ఒంగోలు సిటీ: సీఎం వైఎస్ జగన్ లాంటి యోధుడిని ఎదుర్కొనేందుకు గుంటనక్కలన్నీ ఒక్కటవుతున్నాయని పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ-జనసేన పార్టీల దోస్తి, తెలంగాణాలో కాంగ్రెస్-టీడీపీ, బీజేపీ-జనసేన పార్టీల దోస్తీ వల్ల దివంగత ఎన్టీ రామారావు ఆత్మ క్షోభిస్తుందన్నారు. కాంగ్రెస్‌పై పోరాటంలో భాగంగా టీడీపీ ఆవిర్భవించిందన్నారు. చంద్రబాబు తన సొంత ప్రయోజనాల కోసం ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్‌తో టీడీపీ జెండాలు, కూకట్‌పల్లిలో బీజేపీతో టీడీపీ జెండాలను తాకట్టు పెట్టారని విమర్శించారు. విధివిధానాలు, సిద్ధాంతాలు లేని టీడీపీ, జనసేన పార్టీలకు 2024లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని చెప్పారు. పవన్‌కళ్యాణ్ ఆంధ్రాలో టీడీపీతో, తెలంగాణలో బీజేపీతో నటిస్తూ పొత్తు పెట్టుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారన్నారు. రాజకీయాల్లో జనసేన పార్టీ ఆవిర్భవించిన తర్వాతే వ్యక్తిగత దూషణల పర్వం కొనసాగుతుందన్నారు. రాజకీయ పార్టీ అంటే విలువలు, విశ్వసనీయతతో కూడుకొని ఉండాలే కానీ, పరుషమైన పదజాలంతో అసభ్యకర ఆరోపణలు చేయడం వల్ల రాజకీయాలు ఏ విధంగా దిగజార్చుకుంటున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన పాదయాత్రకు, లోకేష్ చేసిన పాదయాత్రకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసినప్పుడు స్థానిక సమస్యలు తెలుసుకుంటూ, ఏదైనా తప్పు జరిగితే అధికార పక్షాన్ని నిలదీశారన్నారు. కానీ నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రలో స్థానిక సమస్యలను గాలికొదిలి జగనన్నను తిట్టడమే లక్ష్యంగా పెట్టుకుని పాదయాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి లోకేష్‌ది కాదన్నారు. జగనన్న కోర్టు మీద గౌరవంతో శుక్రవారం హాజరై చట్టం ముందు అందరూ సమానులే నిరూపించారని, కానీ చంద్రబాబును అరెస్ట్ చేస్తే లోకేష్ ఢిల్లీ వెళ్లి దాక్కున్నారని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వంలో, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒకే బడ్జెట్ ఉందని, కానీ ప్రజల సంక్షేమానికి లక్షల కోట్లు ఖర్చు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పథకాలను మ్యానిఫెస్టోలో ప్రకటించి అమలు చేయని ఘనత చంద్రబాబుదన్నారు. ప్రత్యేక హోదాకు బదులు చంద్రబాబు తీసుకున్న ప్రత్యేక ప్యాకేజీ నిధులు రూ.20 వేల కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతు భరోసాకేంద్రాలు, సచివాలయాలు, హెల్త్ సెంటర్లు, మెడికల్ కాలేజీలు, నాడు-నేడు పాఠశాలల అభివృద్ధి..ఇవన్నీ అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. వాన పడితే కారే అసెంబ్లీనా అభివృద్ధి అని ప్రశ్నించారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. జగనన్న సంక్షేమ పథకాలే ఆయనకు శ్రీరామరక్ష అన్నారు. శాసనసభలో ఒక్కస్థానం కూడా లేని జనసేనతో పొత్తు పెట్టుకొని రాజకీయాల్లో ముందుకు పోతున్నారంటే మీ దిగజారుడు స్థాయిని ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారన్నారు.

ఇండస్ట్రియల్ భూముల పరిశీలన

- ఏపీఐఐసీ ఎండీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించిన బీపీసీఎల్ ప్రతినిధులు

దొనకొండ (కురిచేడు): మండలంలోని ప్రభుత్వ భూములను ఏపీఐఐసీ ఎండీ, పరిశ్రమల శాఖ కమిషనర్, మారిటైమ్ బోర్డు మెంబరు ప్రవీణ్‌కుమార్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. మండలంలోని బాదాపురం, రుద్రసముద్రం, ఇండ్లచెరువు, రాగమక్కపల్లి గ్రామాల పరిధిలోని భూములను, ఎంఎస్ఎంఈ భూములను వారు పరిశీలించారు. ఆ భూములకు రోడ్డు, నీటి వసతి, విద్యుత్ సౌకర్యం లాంటి వాటిని మ్యాపుల ద్వారా వారికి ప్రవీణ్‌కుమార్ వివరించారు. విదేశాల నుంచి షిప్పుల ద్వారా ముడిసరుకు తెచ్చి రిఫైండ్‌చేసే పరిశ్రమను స్థాపించేందుకు 6 వేల ఎకరాల భూమి అవసరమని, జాతీయ రహదారిని కలిపే రోడ్డు, నీరు, విద్యుత్ అవసరమని కంపెనీ ప్రతినిధులు కోరారు. కంపెనీకి భారీ వాహనాల్లో సరుకు రవాణా కొనసాగుతుందని, రాకపోకలకు, వాహనాలకు ఇబ్బంది లేని రహదారి అవసరమన్నారు. తమకు అనువుగా అన్ని వసతులు కల్పిస్తే కంపెనీ స్థాపనకు మొగ్గు చూపనున్నట్లు కంపెనీ ప్రతినిధులు సూచనప్రాయంగా చెప్పారు. అందుకు ఆర్డీఓ, తహసీల్దార్లు సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. కార్యక్రమంలో కనిగిరి ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్, దొనకొండ, దర్శి తహసీల్దార్లు యం సువర్ణ, కే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


నిమ్జ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఏపీఐఐసీ ఎండీ ప్రవీణ్‌కుమార్


కంపెనీ స్థాపనకు అవసరమైన మౌలికవసతుల గురించి వివరిస్తున్న ప్రతినిధి

నిమ్జ్ భూములు పరిశీలించిన ఏపీఐఐసీ ఎండీ

పామూరు: మండలంలోని మాలకొండాపురం వద్ద ఏర్పాటు చేయతలపెట్టిన నిమ్జ్ ప్రతిపాదిత భూములను ఏపీఐఐసీ ఎండీ కె.ప్రవీణ్‌కుమార్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పామూరు, పీసీపల్లి మండలాల్లో నిమ్జ్‌కు కేటాయించిన సుమారు 12 వేల ఎకరాల భూములపై ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్, తహసీల్దార్ ఆవుల సురేష్‌తో చర్చించారు. నిమ్జ్ ఏర్పాటుకు ముఖ్య వనరు అయిన నీటి వసతిపై ఆరా తీసి, వెలిగొండ ప్రాజెక్టు నుంచి నీటి సరఫరాపై చర్చించారు. ప్రతిపాదిత నిమ్జ్ ప్రాంతంలో అన్ని వసతులు ఉంటే వెంటనే పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని, ఆ దిశగా కార్యాచరణ చేపట్టామని తెలిపారు. ఆయన వెంట ఏపీఐఐసీ జెడ్ఎం గోపీకృష్ణ, మండల సర్వేయర్ కె.స్నేహ, పవన్, వీఆర్‌వోలు శ్రీను, రఫీ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు అండగా సీఎం జగన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం టౌన్: రాష్ట్రంలోని కాంట్రాక్టు కార్మికులకు ఆప్కాస్ ద్వారా వేతనాలు అమలు చేసి వారి అభ్యున్నతికి కృషి చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అని ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆప్కాస్ ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులతో డైరెక్టర్లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ గతంలో కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చాలా తక్కువ అందాయని వాటిలో కాంట్రాక్టర్ల కమీషన్లు అన్నీపోగా సుమారు 10 నుంచి 11 వేల వరకూ వచ్చేవనీ, సీఎం వైఎస్ జగన్ అధికారంలోనికి వచ్చిన తర్వాత ఆప్కాస్ ఏర్పాటు చేసి మధ్యవర్తి ప్రమేయం లేకుండా సుమారు రూ.21 వేల వేతనాన్ని వారి ఖాతాల్లోనే జమ చేస్తున్నారన్నారు. కార్మికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ మాట్లాడుతూ.. కార్మికులకు మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. అనంతరం ఆప్కాస్ డైరెక్టర్లు డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, భాస్కర్‌రెడ్డి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో అంబవరం లయన్ భాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, కమిషనర్ గిరి కుమార్, డాక్టర్ కిరణ్, కౌన్సిలర్ షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన భూమిలో రిజిస్ట్రేషన్ చేయించుకోండి

ఒంగోలు టౌన్: 2023-24 విద్యాసంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీలో చేరిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులముల సంక్షేమ అధికారి యస్.లక్ష్మానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జగనన్న విద్యాదీవెన, జగనన్న విద్యా వసతి స్కాలర్‌షిప్‌ల కోసం వెబ్‌సైట్‌లో ఇచ్చిన సూచనలను ప్రకారం కళాశాలలో దరఖాస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈనెల 29 నుంచి డిసెంబర్ 31 వరకు దరఖాస్తులను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం గడువు విధించినట్లు తెలిపారు.

ఎన్నికల విధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్

మార్కాపురం టౌన్: ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సౌజన్య ఫంక్షన్ హాల్లో ఓటర్ల జాబితా, సవరణలు, సంబంధిత క్లెయిమ్స్ పరిష్కారంపై బీఎల్‌ఓ, సూపర్‌వైజర్లు, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలతో నియోజకవర్గ స్థాయి సమీక్ష నిర్వహించారు. కలెక్టర మాట్లాడుతూ పెండింగులో ఉన్న క్లెయిమ్స్‌ను పరిష్కారంలో నిబంధనలను ఉల్లంఘించరాదని సిబ్బందికి స్పష్టం చేశారు. లోపరహితమైన ఓటర్ల జాబితా రూపొందించడంతోనే ఎన్నికల ప్రక్రియ సగం పూర్తయినట్లవుతుందన్నారు. బీఎల్‌ఓ విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ సిబ్బంది ఎన్నికల విధులను రెగ్యులర్ డ్యూటీ కాదనే అభిప్రాయంతో ఉండరాదని చెప్పారు. వివాహం చేసుకుని వేరే ప్రాంతాలకు వెళ్లిన మహిళలు, చనిపోయిన, వలస వెళ్లిన వారి ఓట్ల తొలగింపు విషయంలో బీఎల్‌ఓలు కచ్చితంగా నిబంధనల ప్రకారం వ్యవహరించాలని ఆదేశించారు. డిసెంబరు 9 నాటికి వచ్చే క్లెయిమ్స్ అన్నింటినీ పరిష్కరించి జనవరిలో పబ్లిష్ చేసే ముసాయిదా ఓటర్ల జాబితాలో అర్హుల పేర్లుండేలా చూడాలన్నారు. ఈ ప్రక్రియలో గ్రామ, వార్డు వలంటీర్లను భాగస్వాములను చేయవద్దని స్పష్టం చేశారు. సమావేశం అనంతరం గుండంచర్ల నిర్వాసితులు కలెక్టర్‌ను కలిసి ఒకే ప్రాంతంలో పునరావాస గృహాలు కేటాయించాలని వినతిపత్రం అందజేయగా సానుకూలంగా స్పందించారు. జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, సబ్ కలెక్టర్ సేతుమాధవన్, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రుణాల రెన్యువల్‌పై రైతుల ఆందోళన

- ఫీల్డ్ ఆఫీసర్‌కు వడ్డీ చెల్లించినా మళ్లీ అడగడంపై నిలదీత
- విచారణ చేపట్టకుండా కాలయాపన చేయడంపై ఆగ్రహం
- సమస్య పరిష్కరిస్తామని సీనియర్ రికవరీ మేనేజర్ హామీ


బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న రైతులు, వ్యాపారస్తులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని కెనరా బ్యాంకు వద్ద పదుల సంఖ్యలో రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. రుణాల రెన్యువల్‌పై కొద్ది నెలలుగా రైతులకు, బ్యాంకు అధికారులకు మధ్య సాగుతున్న వ్యవహారమే ఆందోళనకు కారణం. వివరాల్లోకి వెళ్తే.. కెనరా బ్యాంకులో సుమారు 100 మందికి పైగా రైతులు, వ్యాపారులు ఒక్కొక్కరు రూ.2.5 లక్షల వరకు రుణం తీసుకున్నారు. రుణాలు రెన్యువల్ కోసం ఫీల్డ్ ఆఫీసర్ గౌతమ్‌ను సంప్రదించగా ఆయన సూచన మేరకు వడ్డీ చెల్లించారు. అయితే ఆ నగదును లోన్ ఖాతాకు జమ చేయకపోగా రుణం కూడా రెన్యువల్ చేయలేదు. మరోమారు వడ్డీ చెల్లించాలని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో రైతులు, వ్యాపారులు విస్తుపోయి బ్యాంకు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ తంతు సుమారు 7, 8 నెలల నుంచి సాగుతోందని, ఫీల్డు ఆఫీసర్‌పై బ్యాంకు సిబ్బంది విచారణ కూడా చేయలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఒంగోలు సీనియర్ రికవరీ మేనేజర్ అరుణ్‌కుమార్ బ్యాంకుకు చేరుకుని రైతులతో చర్చించారు. ఫీల్డ్ ఆఫీసర్ గౌతమ్‌కు ప్రమాదం కారణంగా సుమారు 20 రోజుల నుంచి సెలవులో ఉన్నారని తెలిపారు. వడ్డీ చెల్లించిన ఖాతాదారుల వివరాలు సేకరించారు. రీజినల్ బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులందరికీ చేస్తామని హామీ ఇచ్చారు.

విద్యా దీపం వెలిగించిన మహోన్నతుడు పూలే

ఒంగోలు టౌన్: భారత దేశంలోని అట్టడుగు వర్గాల ప్రజల ముంగిట్లో విద్యా దీపం వెలిగించిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం భావితరాలకు ఆదర్శంగా నిలిచారని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 133వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మహిళలకు చదువును నిషేధించిన రోజుల్లో ప్రాణాలకు తెగించి ఆయన పాఠాలు బోధించారని చెప్పారు. రాళ్లతో కొట్టినా వెరవకుండా భార్య సావిత్రిబాయితో కలిసి నిమ్నజాతులకు చదువు చెప్పారన్నారు. ఆనాడు పూలే దంపతులు చేసిన త్యాగాల వల్లే నేడు దేశంలోని మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, దేశ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి, అంటరానితనం, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన నిజమైన ఉద్యమకారుడు పూలే అని కొనియాడారు. వితంతువులకు వివాహాలు చేయడం, స్త్రీలకు సమాన హక్కుల కోసం పూలే పాటుపడ్డారన్నారు. దేశంలో మొట్టమొదటి సారిగా మహాత్మా అని పిలిపించుకున్న మహోన్నత నాయకుడు పూలే అని అన్నారు. డీఆర్‌ఓ ఆర్.శ్రీలత మాట్లాడుతూ.. మూఢనమ్మకాలు, పేదరికం, వెనకబాటుతనం నుంచి బయట పడేందుకు చదువుకోవడం ఒక్కటే సరైన మార్గమని నమ్మిన జ్యోతిరావు పూలే తన జీవిత కాలమంతా విద్యాభివృద్ధికి పాటుపడ్డారని పేర్కొన్నారు. చైతన్యవంతులైన ప్రజలతోనే దేశం సర్వతో ముఖాభివృద్ధి చెందుతుందన్నారు. భర్త ఆశయాలకు అండగా నిలబడిన సావిత్రిబాయి కూడా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎం.అంజల మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిరావు పూలే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం వెనకబడిన తరగతుల అభ్యున్నతి, సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెకటేశ్వరరావు, కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ హరిబాబు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పూలే ఆశయాలు కొనసాగించాలి

ఒంగోలు సబర్బన్: సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందే విద్యా విప్లవం తీసుకొచ్చిన మహాత్ముడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. తొలుత పార్టీ కార్యాలయ ప్రాంగణంలోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. రాష్ట్ర ఆర్య వైశ్య ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ఒనూడా చైర్మన్ సింగరాజు మీనా కుమారి వెంకట్రావు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతి రావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఘంటా రామానాయుడు, పుచ్చకాయల గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.


పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మేయర్ గంగాడ, డీఆర్వో శ్రీలత, బీసీ సంక్షేమాధికారి అంజల

సామాజిక విప్లవకారుడు పూలే : శిద్దా రాఘవరావు

సామాజిక విప్లవానికి పునాదులు వేసిన ఉద్యమకారుడు జ్యోతిరావు పూలే చూపిన మార్గం అనుసరణీయమని వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పేర్కొన్నారు. అణగారిన బతుకుల ఆత్మాభిమాన పతాకం పూలే అని కొనియాడారు. ప్రజలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు జీవితాన్ని ఫణంగా పెట్టిన మహనీయుడు పూలేకు ఘన నివాళులర్పిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని టీటీడీ బోర్డు సభ్యుడు శిద్దా సుధీర్ కుమార్ పేర్కొన్నారు. పూలే నివాళికి ఘనంగా నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు.

జాబ్‌కార్డుదారులందరికీ పని కల్పించాలి

- డ్వామా పీడీ శీనారెడ్డి
- రూ.31 లక్షల రికవరీకి నలుగురు టీఏలకు షోకాజ్ నోటీసులు
- రిజిస్టర్ల నిర్వహణలో నిర్లక్ష్యంపై ఐదుగురు ఎఫ్ఏలపై చర్యలకు సిఫార్సు


సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ శీనారెడ్డి

సీఎస్‌పురం (పామూరు): జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ కె.శీనారెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ 15వ ప్రజావేదిక కార్యక్రమం స్థానిక ఉపాధి కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజావేదికలో మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో 2022-23 ఆర్థికసంవత్సరంలో మండలంలో జరిగిన మొత్తం 341 పనులకు సంబంధించి ఖర్చు చేసిన రూ.9.05 కోట్ల వివరాలను ప్రజావేదికలో డీఆర్‌పీలు, ఎస్ఆర్‌పీతో కలిసి వివరించారు. వీటిలో మొత్తం 291 పనులకు సంబంధించి కూలీలకు రూ.6.39 కోట్లు, మెటీరియల్ కింద రూ.16.79 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. పీఆర్ కింద గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, పాలకేంద్రాలు, హెల్త్‌సెంటర్స్ మొత్తం 45 పనులకు సంబంధించి రూ.2.16 కోట్లు ఖర్చుచేసినట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ కింద 5 పనులకు రూ.31.77 లక్షలు ఖర్చు చేశారు. కాగా కొన్ని పంచాయతీల్లో చెరువుల్లో చేసిన గుంతలపనులు, పూడికపనులు, ఇతర పనుల కొలతల్లో 23 శాతం వ్యత్యాసాలు ఉన్నాయని, పలు పనులకు సంబంధించి సుమారు రు.82 లక్షలు విలువైన పనుల రికార్డులో కొలతలకు, క్షేత్రస్థాయిలో కొలతలకు తేడా ఉన్నాయని ప్రజావేదికలో చదివి వినిపించారు. అదేవిధంగా మస్టర్లలో వేలిముద్రలు లేకుండా రు.55 వేలు కూలీలకు చెల్లించగా మొత్తం రికవరీకి ఆదేశించారు. కాగా రోడ్ల వెంబడి నాటిన మొక్కలకు రూ.5 లక్షల వరకు తేడా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. పనుల కొలతల్లో రికార్డులకు, క్షేత్రస్థాయిలో తేడాలకు సంబంధించి రూ.31 లక్షలు మీ వద్ద ఎందుకు రికవరీ చేయకూడదో సంజాయిషీ ఇవ్వాలని నలుగురు టీఏలకు షోకాజ్ నోటీసులు పీడీ జారీ చేశారు. అదేవిధంగా ఏడుఉ రకాల రిజిస్టర్ల నిర్వహణపై అసంతృప్తి చెందిన ఐదుగురు ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలకు ఆదేశించారు. మస్టర్లలో తేడాలను, కొలతల్లో తేడాలపై డీవీఓను పరిశీలించి నివేదిక ఇవ్వాలని సూచించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలకు ఉపేక్షించేది లేదన్నారు. మహిళా ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో వారి కుటుంబసభ్యులు ప్రజావేదికకు హాజరుకావడంపై పీడీ అసహనం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్.రామచంద్రరావు, డీవీఓ రూన్సీరాణి, ఎస్ఆర్‌పీ సీహెచ్.సుబ్బారావు, ఏపీడీ సీహెచ్ రాజారావు, అంబుడ్స్‌మెన్ శ్రీకాంత్‌రెడ్డి, ఏపీఓ వాక్యవతి, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జెడ్పీ నిర్మాణ పనులు పరిశీలించిన బూచేపల్లి


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

ఒంగోలు సిటీ: జిల్లా పరిషత్ నూతన భవన నిర్మాణ పనులను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ శాసనసభ్యుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మంగళవానం పరిశీలించారు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి జెడ్పీ నూతన భవనంలోని గదులన్నింటిని పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, డీవై సీఈఓ హనుమంతరావు, ఈఈ కోటేశ్వర రావు, డీఈ శివరామకృష్ణ, ఏఈ శేషగిరిరావు, ఒంగోలు ఎంపీపీ మల్లిఖార్జునరెడ్డి పాల్గొన్నారు.